



మంచు కురిసే వేళలో..

దండేపల్లి మండల కేంద్రాన్ని బుధవారం తెల్లవారుజామున పొగ మంచు కమ్మేసింది. గ్రామ శివారుల్లోని పంట పొలాలపై మంచుదుప్పటి కప్పుకుంది. ప్రధాన రహదారిని పొగ మంచు కమ్మేయడంతో ఉదయం వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు. - దండేపల్లి



పార్టీ కోసం పనిచేసిన వారికే పెద్దపీట

- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

మంచిర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికే పెద్దపీట వేస్తామని, స్థానికసంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో గ్రామాల వారీగా సమీక్షించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసినవారికి అవకాశం కల్పిస్తామన్నారు. గ్రామస్థాయిలో ఎలాంటి గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా అందరు సమష్టిగా పనిచేసి పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

కాసిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ముత్యంపల్లి ఫారెస్టు డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగినప్పుడు అడవులు అభివృద్ధి చెంది మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. ప్రతీఒక్కరు వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అక్టోబరు 2 నుంచి 8 వరకు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. వన్య ప్రాణులు, అడవుల సంరక్షణ కోసం అటవీ శాఖకు సహక రించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు హరినాయక్, శంకర్, ఎఫ్‌బీవో శ్రీధర్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

వేమనపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : దస్నాపూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు, మెను ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం కాంపౌండ్‌వాల్, వాష్‌రూం పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో కుమారస్వామి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

మారని తలరాత

- ఎన్నికలెరుగని గూడెం గ్రామం
- 30 ఏళ్లకుపైగా పదవులకు నోచుకోని గ్రామస్థులు
- గ్రామానికి అనుకూలించని రిజర్వేషన్లు
- గిరిజనులు లేకున్నా రిజర్వేషన్లు కేటాయింపు





మంచిర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీకి ఈ ఏడాది కూడా ఎన్నికలు జరిగే అవకాశం లేదు. గ్రామంలో ఒక్క గిరిజనుడు లేక పోయినా... గ్రామ సర్పంచ్ పదవిని మాత్రం షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కులస్థులకు రిజర్వ్ చేస్తూ వస్తున్నారు. దీంతో మూడు దశాబ్దాలకుపైగా సర్పంచ్ పదవికి ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే గ్రామం కొనసాగుతోంది.

నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించడంతో...

గూడెం గ్రామపంచాయతీలో 1,800 పైచిలుకు మంది ఓటర్లు ఉన్నారు. గూడెంలో ఒక్కరు కూడా గిరిజనులు లేకపోయినా 1950లో అప్పటి ప్రభుత్వం గ్రామాన్ని నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించింది. రిజర్వేషన్ ప్రకారం గిరిజనులు ఎవరూ లేకపోవడంతో పోటీ చేసేవారు లేక...అప్పటి నుంచి ఆ గ్రామంలో ఇన్‌చార్జిల ద్వారా పాలనను కొనసాగిస్తున్నారు. 1987 నుంచి గ్రామ సర్పంచ్ స్థానాన్ని సైతం ఎస్టీకి రిజర్వు చేశారు. సర్పంచ్ పదవితో పాటు గ్రామంలోని 10 వార్డు సభ్యుల స్థానాల్లో ఐదింటిని ఎస్టీలకు కేటాయించారు. అప్పటి నుంచి సుమారు 38 ఏళ్ల పాటు గూడెం గ్రామపంచాయతీకి సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అర్హులు లభించడం లేదు. అయినప్పటికీ ప్రతిసారీ పంచాయతీ ఎన్నికల సమయంలో నోటిఫికేషన్ విడుదల చేయడం.. నామినేషన్లు దాఖలు కాకపోవడం షరా మామూలైంది.

ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం...

దశాబ్దాలుగా గూడెం పంచాయతీకి ఎన్నికలు జరుగకపోవడంతో గ్రామస్థులు ఎలాంటి పదవులకూ నోచుకోవడం లేదు. రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేద్దామన్నా... రిజర్వేషన్ అనుకూలించడం లేదు. గ్రామంలో ఎస్టీ జనాభా లేదని, రిజర్వేషన్‌లో మార్పు చేయాలని గ్రామస్థులు పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. రిజర్వేషన్లు మార్చాలని సామూహిక నిరహార దీక్షలు, రాస్తారోకో, తదితర నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఎప్పటిలాగే ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు షెడ్యూల్ ప్రకటించడంతో.. కనీసం ఈసారైనా రిజర్వేషన్లు అనుకూలిస్తాయన్న ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతూ తిరిగి పాత ప్రకారమే ప్రకటన వెలువడింది.

గ్రామంలో రిజర్వేషన్లు ఇలా..

గూడెం సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్ విభాగానికి కేటాయించారు. గ్రామంలో 10 వార్డులు ఉండగా మొదటి ఐదు వార్డులను షెడ్యూల్డ్ తెగలకు కేటాయించగా, మిగిలిన ఐదు వార్డులను జనరల్ కేటగిరికి కేటాయించారు. దీంతో సర్పంచ్ స్థానంతోపాటు ఐదు వార్డుల స్థానాల్లో అక్కడి ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైంది.

క్రీడలతో మానసికోల్లాసం



లక్సెట్టిపేటలో జోనల్‌స్థాయి క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో శైలజ

దండేపల్లి (లక్సెట్టిపేట) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సోదర భావం పెంపొందుతుందని, క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని లక్సెట్టిపేట మండల విద్యాధికారిణి శైలజ అన్నారు. బుధవారం లక్సెట్టిపేటలో జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో తైక్వాండో జిల్లాస్థాయి, జోనల్ స్థాయి అండర్ 14, 17 బాలబాలికల ఎంపిక పోటీలను ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మంచి క్రీడాకారులను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో విశిష్ఠ అతిథి ఎండీ యాకుబ్, ఇనిస్టిట్యూట్ ఆర్గనైజర్ కె సుధాకర్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సంకటహర చతుర్థి

నస్పూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మీగణపతి దేవాలయంలో ఈ నెల 10న శుక్రవారం సంకటహర చతుర్థి సందర్భంగా స్వామి వారికి మహా హరిద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు వంశీ కృష్ణ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం షోడశ ద్రవ్యాభిషేకం, గణపతి, లక్ష్మి గణపతి హోమం, సాయంత్రం స్వామి వారికి పసుపుతో విశేష మహా హరిద్రాభిషేకం జరుగుతుందన్నారు. చంద్రోదయం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

'పొన్నం'ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న మాదిగ హక్కుల దండోర నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాదిగ హక్కుల దండోర నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పొన్నం ప్రభాకర్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పొన్నం ప్రభాకర్ తక్షణమే బేషరతుగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రిని అవమానిస్తే యావత్ మాదిగ జాతిని కించపరిచినట్లేనని పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే దశలవారిగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు, నాయకులు రమేశ్, రాజుకుమార్, గోగర్ల శేఖర్, నవీన్, వెంకటేశ్, మల్లేశ్, రాజం, ఐలయ్య, వేణు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ కుమార్ దీపక్



కన్నెపల్లిలో రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం సందర్శించి నామినేషన్ల స్వీకరణ, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహిస్తామన్నారు. ఈ నెల 9 నుంచి 11 వరకు నామినేషన్ల స్వీకరణ, 15న ఉపసంహరణ, 23న పోలింగ్, నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పాటించాలన్నారు. కాగా 12 గంటలు దాటినా ఎంపీడీవో కార్యాలయానికి రాకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, తహసీల్దార్ రాంచందర్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణ సక్రమంగా జరగాలి

భీమిని: స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎన్నికల అంశాలపై ఆరా తీశారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్లు, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ, ఫలితాల ప్రకటన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బికర్ణదాస్ ఉన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్

హాజీపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల విషయమై చర్చించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. అనంతరం హాజీపూర్ పోలీసుస్టేషన్‌ను సందర్శించి స్థానిక సంస్థల ఎన్నికల నియామవళి అమలు, శాంతియుత పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు తీసుకునే చర్యల గురించి స్థానిక పోలీసులకు సూచించారు. ఆయన వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, రూరల్ సీఐ ఆకుల అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్‌పాండే, ఎస్‌ఐ స్వరూప్ రాజ్ ఉన్నారు.



ఎంపీడీవోతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ

ఆటోపై టాప్ నంబర్లు వేసుకోవాలి

మంచిర్యాల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆటోలపై టాప్ నంబర్లు వేసుకోవాలని జిల్లా ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తూముల నరేష్, కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఆటో టాప్ నంబర్లతో సులువుగా ఆటోను గుర్తించడం జరుగుతుందని, ప్రతీ ఆటో యజమాని విధిగా టాప్ నంబరు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోల రాజగౌడ్, సతీష్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిగా రమాదేవి

మంచిర్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గిరిజన అబివృద్ధి అధికారిగా రమాదేవి బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. రమాదేవి ప్రస్తుతం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులుగా పనిచేస్తున్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు బందోబస్తు, అధికారులు, సిబ్బంది నియామకం ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పాటించాలన్నారు. జిల్లా కలెక్టర్లు హెడ్ క్వార్టర్స్‌లో ఉండి నామినేషన్ల ప్రక్రియను సమీక్షించాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఈ నెల 9న నామినేషన్ల స్వీకరణకు సిద్ధంగా ఉన్నామన్నారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య,జడ్పీసీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఎంపిక పోటీలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు సెక్రెటరీ ఎండీ యాకుబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9న జిల్లా పరిషత్ హైస్కూల్ ముల్కల్లలో టేబుల్ టెన్నిస్ అండర్ 14-17 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీన అథ్లెటిక్ జిల్లాస్థాయి ఎంపిక గవర్నమెంట్ కాలేజీ మంచిర్యాలలో, 14వ తేదీన కేజీఏ డిఫెన్స్ అకాడమీ సీసీ కార్నర్‌లో కబడ్డీ ఎంపిక పోటీలు, ఈ నెల 15న జిల్లా పరిషత్ హైస్కూల్ అచ్చులాపురంలో బ్యాట్మింటన్ పోటీలు, 15న హైటెక్ కాలనీ మంచిర్యాల క్లబ్‌లో జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు, 16న హైటెక్ కాలనీ మంచిర్యాల క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక





కోటపల్లి, బెల్లంపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ,

కోటపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కోటపల్లి పీఎంశ్రీ మోడల్ స్కూల్ విద్యార్థి సుకుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, పీఈటీ రాజయ్య తెలిపారు. ఇటీవల మంచిర్యాలలోని మోడల్ స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో కోటపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ సీఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి సుకుమార్ అత్యంత ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడన్నారు. సుకుమార్ ఈ నెల 10 నుంచి మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా బుధవారం సుకుమార్‌ను ప్రిన్సిపల్ రాజశేఖర్, పీఈటీ రాజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు జ్ఞాపికలు అందించి అభినందించారు.

బెల్లంపల్లి: రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ పోటీలకు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన స్వామి అనే పదోతరగతి విద్యార్థి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో స్వామి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. ఎంపికైన విద్యార్థిని పీడీ హరీశ్, పీఈటీ రాజేందర్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు..

కాసిపేట: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు వికాస్, అర్జున్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మహబూ బాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. బుధవారం విద్యార్థులను ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.



విద్యార్థులతో కళాశాలప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు

జన్నారం: ఈనెల 9, 10న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని డీఎస్ క్రీడా మైదానంలో నిర్వహించే 7వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ క్రీడా పోటీలకు మంచిర్యాల జిల్లా నుంచి ఆడటానికి స్లేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు భానుచరణ్, అరవింద్ తేజస్విన్‌లు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను స్లేట్ విద్యా సంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ ఏనుగు రజితరెడ్డి, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు అభినందించారు.

స్థానిక పాలన ప్రగతికి ఆలంబన



పల్లెల సమగ్రాభివృద్ధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్ర కీలకం

బెజ్జూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు. పంచాయతీలను ఆర్థికంగా పరిపుష్టం చేస్తేనే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందనేది నిజం. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్రంలో 1994పంచాయ తీరాజ్ చట్టం ద్వారా జిల్లా ప్రాదేశిక, మండల ప్రాదేశిక నియోజక వర్గాలు ఏర్పడ్డాయి. అంతకుముందు గ్రామ సర్పంచ్‌లు మండల ప్రజా పరిషత్తులో, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జిల్లా ప్రజా పరిషత్తులో సభ్యులుగా ఉండేవారు. ప్రాదే శిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ప్రాధాన్యంపై 'ఆంధ్రజ్యోతి'ప్రత్యేక కథనం..

సభ్యుల ఆమోదంతోనే..

మండల పరిషత్తు సమావేశాల్లో మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే తీర్మా నాలు పట్టాలెక్కుతాయి. ఎంపీటీసీ సభ్యు డు తన ప్రాదేశిక నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో శాశ్వత ఆహ్వాని తుడు. పంచాయతీ సమావేశాలకు హాజ రు కావచ్చు. ఓటు హక్కు మాత్రం ఉండదు. మండల పరిషత్తు అభివృద్ధి, సమీక్ష సమా వేశాలకు హాజరై తన పరిధిలోని సమ స్యలను ప్రస్తావిస్తూ, నిధుల మంజూరుకు కృషి చేయాలి. అభివృద్ధి పనుల్లో అక్రమాలను ఉనతాధికారుల దృష్టికి తీసు కెళ్లవచ్చు. తన పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యాప్రమాణాల మెరుగుకు సూచనలు అందించ వచ్చు. మండల పరిషత్తు నిధుల విషయంలో అధి కారులను ప్రశ్నించవచ్చు. అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లే అధికారం ఉంటుంది.

జడ్పీటీసీ సభ్యుల మద్దతు..

జిల్లా పరిషత్ తీర్మానాల ఆమోదంలో మెజారిటీ జడ్పీటీసీ సభ్యుల మద్దతు తప్పని సరి. తమ మం డల పరిషత్తు సమావేశాలకు హాజరై అక్కడ పరి ష్కారం పొందలేని సమస్యలు జడ్పీ సమావేశాల్లో ప్రస్తావించ వచ్చు. పనుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం లాంటివి జడ్పీ చైర్మెన్ లేదా సీఈవో దృష్టికి తీసుకెళ్లవచ్చు. జడ్పీ అజెండాలో సమస్యలను చేర్చే, తీర్మానాలను ప్రతిపాదించే అధి కారం ఉంటుంది. ముందస్తు నోటీసుతో జడ్పీ పరిపా లనకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించవచ్చు. ఆర్థిక నివేదికను పరిశీలించి సూచనలు చేయయ వచ్చు. జడ్పీ పాఠశాలలను సందర్శించి సూచనలు ఇవ్వవచ్చు. మండల, నియోజకవర్గ నీటి వినియోగ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా నీటి పరిరక్షణకు చర్య లు చేపట్టే అవకాశం ఉంటుంది.

పాఠశాలలను సందర్శించి.. సూచనలు చేసి..



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండ లం చిర్రకుంట, రింగన్ గూడ గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి సందర్శించి ఎఫ్ఎల్ఎన్, ఏఐ, ఎక్స్ఎల్ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సూచనలు చేశారు. ఈ సంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లల్లో విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లో విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానంపై అందిస్తున్న శిక్షణపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, అకాడమిక్ ఎక్సెలెన్స్‌లో కార్యక్రమ పురోగతి, తరగతి గదిలో సాంకేతిక పరి జ్ఞానం వినియోగాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచ నలు చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయం రాజీ పడకూడదని అన్నారు. ప్రతీ విద్యార్థికి పౌష్టిక ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం



పూజలు చేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

రెబ్బెన, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షు రాలు ఆత్రం సుగుణక్క అన్నారు. మండల కేంద్రంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ కార్యాలయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ వంటి నాయకులు దేశంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు మార్గదర్శకులుగా నిలిచారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. మహిళలు రాజకీయాలు, విద్య, వ్యాపార రంగాల్లో ముందుకు వెళ్లాలనే ఉద్దేశంతో రాహుల్‌గాంధీ శక్తి అభియాన్, ఇందిరా ఫెల్లోషిప్ సంస్థలను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రతీ మహిళ ఇందిరా ఫెలోషిప్‌లో చేరాలని సూచించార కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మండ లాధ్యక్షుడు రమేష్, నాయకులు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

నెన్నెల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎండీ హబీబ్‌పాష అన్నారు. ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండల యూనియన్ ఆధ్వర్యం లో తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గిరాకిలేక ఈఎంఐలు కట్టుకోలేక ఆటోవాలాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ఫైనాన్సర్ల వేదింపులకు నెన్నెల మండలం జంగాల్‌పేట యువతి బలవ్మరణానికి పాల్పడిన సంఘటనను గుర్తుచేశారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ హామీ మేరకు రూ. 12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు యూరియా పంపిణీ

సిర్పూర్(టి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని చింతకుంట, చుంచుపల్లి, భూపాలపట్నం, హీరాపూర్, అచ్చెల్లి, అరేపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల రైతులకు గురువారం యూరియా పంపిణీ చేస్తామని ఏవో గిరీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కోసం వచ్చే రైతులు పట్టాపాసు పుస్తకం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని సూచించారు. రైతులకు సరిపడా యూరియా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

కౌటాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు బుధవారం ఎంఆర్సీ కార్యాలయంలో అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో హనుమంతు, కాంప్లెక్స్ హెచ్ఎం నారాయణసింగ్, ప్రధానోపాధ్యాయులు అరుణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలి

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల కౌంటింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌటింగ్ గదులు, స్ట్రాంగ్ రూం, ఏర్పాట్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విడతలుగా నిర్వహించే ఎన్నికల్లో బ్యాలెట్ బాక్సులు, కౌంటింగ్ కేంద్రాలలో పూర్తి బందోబస్తుతో భద్రపరచడం జరుగు తుందన్నారు. నిర్వహణ ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడా లన్నా రు. అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అవసరమైన ఏర్పాట్లు చేయాల న్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఆసిఫాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భజనం అంశాలను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని చెప్పారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. వసతి గృహ పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి రోజు వంట శాఖ, స్టోర్ రూం, తాగునీరు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పని సరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు తమ పీరియడ్ సమయానికి స్టాఫ్ రూంలో కాలక్షేపం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలనలో నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల గణనపై అవగాహన



మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివి జన్‌లో ఆలిండియా టైగర్ ఎస్టీమేషన్ 2026 సంవత్సరానికి గాను జన్నారం అటవీ డివిజన్ పరిధిలో గల టీడీసీ సెంటర్‌లో అధికారులకు వన్యప్రాణుల గణనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎఫ్‌డీవో రామ్మోహన్ మాట్లాడుతూ ప్రతీ నాలుగు ఏళ్లకు ఒక సారి దేశ వ్యాప్తంగా వన్య ప్రాణుల గణన నిర్వహిస్తామని చెప్పారు. మాంసాహార జంతువులతో పాటు సాధారణ జంతువుల గణన నిర్వహిస్తామని అన్నారు. అందులో భాగంగా అధికారులకు జంతు గణనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలతో పాటు ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో, అనిమల్ ట్రాకర్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వోల్వో డంపర్, ట్రక్కు డ్రైవర్ శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు, పరిసర గ్రామాలకు చెందిన యువత దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 60 మందిని ఎంపిక చేసి 90 రోజుల పాటు శిక్షణ అందిస్తామని తెలిపారు. 10వ తేదీలోగా ఎంవీటీసీలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సీసీఐ, మార్కెటింగ్, అగ్నిమాపక శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో పత్తి కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ వానాకాలంలో రైతులు 3.34 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారని అన్నారు. 38 లక్షల క్వింటాళ్ల పత్తి పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు రూ.8110 మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా పత్తి పంటను విక్రయించుకునేందుకు స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో నవంబరు మొదటి వారంలో పత్తి కొనుగోలు ప్రారంభించాలని చెప్పారు. జిన్నింగ్ మిల్లులో ఏమైనా మరమ్మతులు ఉన్నట్లయితే సమయంలోగా పూర్తి చేసుకుని కొనుగోలుకు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అన్నారు. జిన్నింగ్ మిల్లుల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా అగ్నిమాపక శాఖ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లులో ఎలక్ట్రానిక్ తూకాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. పత్తి నిలువలు పేరుకు పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిన్నింగ్ మిల్లులో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ కల్పించాలని అన్నారు. జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేపట్టేం దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు దళారులకు విక్రయించకుండా సీసీఐ కేంద్రాలలో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖాధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటి, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, జిల్లా రవాణా శాఖాధికారి రాంచందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దండేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మేదరిపేట బస్టాండ్ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలుయ్యాయి. మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన షేర్ల అక్షయ్, పట్నూరి సిద్ధార్థ ఇద్దరు ఎలక్ట్రిల్ స్కూటీపై పనుల నిమిత్తం మేదరిపేట వచ్చారు. పనులు ముగించుకొని నాగసముద్రంనకు వెళ్తుండగా మంచిర్యాల నుంచి జన్నారం వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది, దీంతో స్కూటీపై వెళ్తున్న పట్నూరి సిద్ధార్థ కాలు విరిగింది. అక్షయ్‌కి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సిద్ధార్థను 108 వాహనంలో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

పులి దాడిలో గేదె మృతి

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని అనుకోడా అటవీ ప్రాంతంలో పులి దాడిలో గేదె మృతి చెందింది. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అనుకోడ గ్రామానికి చెందిన గోపికి చెందిన గేదె మృతి చెందడంతో తనకు నష్టపరిహారం ఇప్పించాలని అధికారులను విన్నవించాడు. అనుకోడ శివారు అటవీ ప్రాంతంలో పెద్ద పులి కదలికలకు సంబంధించి, పాదముద్రలను సిబ్బంది పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

హామీల అమలులో గుర్తింపు సంఘాలు విఫలం



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు


శ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అమలు చేయడంలో విఫలమయ్యాయని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఏరియా ఉపాధ్య క్షుడు బండి రమేశ్ ఆధ్వ ర్యంలో బుధవారం ఆర్కే 7 గనిపై యూనియన్ సభ్యత్వ నమోదు నిర్వహిం చారు. ఈ సందర్భంగా సురేంద ర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో కారుణ్య నియామకాలు, తదితర అనేక హక్కులను కల్పించామని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే లాభాల వాటా ప్రకటన వెలువడే దన్నారు. ఆనాడు గనులపై పండుగ వాతావ రణం నెలకొనేదని చెప్పారు. ప్రస్తుతం అలా లేదన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు సింగరేణి యాజమాన్యానికి తొత్తులుగా మారి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. లాభాల వాటా విషయంలోనూ అలాగే జరిగిందన్నారు. అనంతరం పలువురు కార్మికులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు పొనగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ నాయకులు వంగల కుమారస్వామి, తోంగల రమేశ్, జగదీష్ కుమార్, పిట్ కార్యదర్శి రాజు, సహాయ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు ఐఎన్‌టీయూసీ కృషి

శ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్మి కుల హక్కులను సాధించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. ఆర్కే 5 గనిపై బుధవారం యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం సింగరేణి సాధించిన లాభాల నుంచి కార్మికులకు వాటా చెల్లించేందుకు, దీపావళి బోనస్ సాధించేందుకు తాము కృషి చేశామన్నారు. రెండేళ్లుగా ఏఐటీయూసీ కార్మికుల కోసం ఎలాంటి పనులు చేయలేదని ఆయన ఆరోపించారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం ఐఎన్‌టీయూసీ తోనే సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి యూనియన్ సభ్యత్వం అందించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్‌రెడ్డి, పిన్నింటి మల్లారెడ్డి, రామకృష్ణ, బ్రాంచ్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీనివాసరావు, పెద్ది రాజు, మల్లేష్, యాదగిరి పాల్గొన్నారు.



సభ్యత్వ రశీదు అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు



సింగరేణిలో సమ్మెలు నిషేధం

తెలంగాణ ఎస్మా కింద నోటిఫికేషన్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ఎస్మా-1971 కింద నోటిఫికేషన్ ఇస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం జీవో జారీ చేశారు. ఈ నిషేధం గత సెప్టెంబరు 11వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. నిషేధం 6 నెలల పాటు అమలులో ఉండనుంది.

వారసులకు వెంటనే ఆర్డర్లు ఇవ్వాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలు పొందే వారసులకు వెంటనే ఆర్డర్లు ఇవ్వాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనారోగ్య కారణాలతో చాలా మంది ఉద్యోగులు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయ్యారని, వారి వారసులకు సైతం ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు అయిపోయాయని పేర్కొన్నారు. త్వరలో వీటీసీ పత్రాలు పొందుతామని అనుకుంటుండగా యాజమాన్యం ఏడు నెలలుగా నియమాక పత్రాలు అందించడం లేదని తెలిపారు.. ఉద్యోగి నిర్ణీత గడువులోగా మెడికల్ బోర్డుకు దరఖాస్తు పెట్టుకోకపోతే తిరస్కరిస్తుందని పేర్కొన్నారు. కానీ వారసులకు అన్ని పరీక్షలు పూర్తయినా ఇంతవరకు ఆర్డర్లు ఇవ్వకపోవడం అన్యాయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ నాయకులతో ఆర్డర్లు ఇప్పించడానికి తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. గత నెల 22వ తేదీన ఉద్యోగ నియామకపత్రాలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే ఆర్డర్లు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

చేయిచేయి కలిపి.. రహదారిని బాగు చేసి..


తాళ్లపేట ప్రధాన రహదారిపై మరమ్మతులు చేపడుతున్న యువకులు

దండేపల్లి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేటలో అటవీ రేంజ్ కార్యలయం, ఎస్‌బీఐ సమీపంలో ప్రధాన రహదారి చెడిపోయి పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో తరుచుగా వాహనదారులకు ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్నారు. సంబంధిత ఆర్ అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని స్థానిక యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాళ్లపేటకు చెందిన యువకులు విరాళాలు సేకరించారు. మంగళవారం రాత్రి ప్రధాన రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో సిమెంట్ ఇసుక, కంకరతో నింపి రోడ్డును బాగు చేశారు.

సీజనల్‌వ్యాధులపై అవగాహన


సోమగూడెంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాసిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బుధవారం సోమగూడెంలో ప్రజలకు ఆట,పాటల ద్వారా అవగాహన కల్పించారు. సారధి కన్వీనర్ ముల్కల మురళి మాట్లాడుతూ రోగాల బారి నుంచి కాపాడుకునేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటును అమ్ముకోకుండా ప్రతీ ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మామిళ్ల లచ్చన్న, లావుడ్యరమేష్, పోశం, రాంటెంకి రాజతిరుపతి, గొడిసెల కృష్ణ, సత్యనారాయణ, నిరోషా, సంధ్య, తస్లీమా సుల్తానా పాల్గొన్నారు.

నామినేషన్లకు సర్వం సిద్ధం


నామినేషన్ సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం నుంచి స్వీకరించే నామినేషన్‌లకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్‌అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్‌ల స్వీకరణకు అంతా సిద్ధం చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ నామినేషన్‌లు వేసే వారు ఎంపీడీవో కార్యాలయంలో, ఎంపీటీసీలకు నామినేషన్‌లు వేసే వారు ఎంపీడీవో సమావేశ మందిరంలో తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జీలు సుధాకర్ నాయక్, రమేష్‌రాథోడ్, సాంబమూర్తి, ఎంపీవో సప్దర్ ఆలీ, ఎన్నికల సిబ్బంది నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

దుఃఖంలో పత్తి రైతు

- పత్తి పంటకు వర్షం దెబ్బ
- రైతన్నను నిండా ముంచిన అధిక వర్షాలు
- రాలిపోతున్న పూత, కాత
- నల్లబారుతున్న కాయలు
- తెగుళ్లు, చీడపీడల విజృంభణ
- పచ్చగా ఉండాల్సిన వేళ ఎర్రబారుతున్న చేలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం


నెన్నెలలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తిచేను, తడిసిన పత్తి కాయలో వచ్చిన మొలకలు

నెన్నెల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకు కష్టకాలం వచ్చింది. రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. ముందుగా కాసిన కాయలన్నీ నల్లబడిపోయాయి. విచ్చుకున్న పత్తి తడిసి అందులో మొలకలు వస్తున్నాయి. వానలకు చీడ పీడలు, తెగుళ్ల ఉధృతి పెరిగింది. తెల్లదోమ, పచ్చదోమ దాడి పెరిగిపోయింది. దీంతో మలిదశ పూత, కాతంతా రాలిపోతోంది. తెగుళ్లతో ఆకులు ఎర్రబారి చెట్టు కుంగిపోతోంది. మరో రెండునెలలు పచ్చగా ఉండాల్సిన చేలు పండుటాకులతో వెలవెలబోతున్నాయి. ఆకురాల్చి మొక్కలన్ని మోడులవుతున్నాయి. వర్షాలు తెరిపినివ్వక పోవడంతో రైతులు నివారణ చర్యలు చేపట్టలేక పోతున్నారు. దీంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులంటున్నారు. ఎడతెరిపి లేని వర్షాలు తమను నిండా ముంచాయని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూమిలో అధిక తేమతో..

పత్తి ఆరుతడి పంట.., అడపదడపా వర్షాలు కురిస్తే పత్తిచేలు ఆరోగ్యంగా ఎదిగి, ఆశించిన దిగు బడినిస్తాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఇందు కు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. జూన్, జూలై నెల ల్లో తీవ్ర వార్షాభావం ఉండగా ప్రస్తుతం వర్షాలు దంచి కొడుతున్నాయి. రెండునెలలుగా తెరిపిలేకుండా కురుస్తున్నాయి. భూమిలో అధిక తేమతో పత్తి పంటకు వేరుకుల్లు, పారవిల్ట్ లాంటి తెగులు సోకి వేరు వ్యవస్థ దెబ్బతిని ఎదుగుదల నిలిచిపోయింది. బురదమయంగా ఉన్న చేలల్లో సూక్ష్మధాతు లోపం కనిపిస్తోంది. మెగ్నీషియం, జింకు, బోరాన్ లోపం వల్ల పంట దెబ్బతింటోంది. వర్షం భయంతో ఎరువులు వేయడం లేదు. పురుగు మందులు పిచికారి చేయలేక పోతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే వేల దెబ్బతింటుండటంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

సగానికి తగ్గనున్న దిగుబడి

ఈ ఏడు జిల్లాలో 1.61 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాదాపు 13 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనాలు వేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చీడ పీడల కారణంగా దిగుబడులు సగానికి పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు పంటను దెబ్బతీశాయి. మొదటి కాసిన కాయలన్నీ నల్లబడ్డాయి. విచ్చుకున్న పత్తి బూజుపట్టి రంగు మారింది. మొదట్లో కాసిన కాయలే పెద్దగా ఉండి బరువు తూగుతాయని రైతులంటున్నారు. ఆ కాయలన్నీ నల్ల బడి నేలరాలడంతో పాటు దోమ పోటుతో రెండో దశ పూత, కాత నిలవడం లేదు. తెగుళ్లతో రెండునెలల ముందుగానే చేలన్ని ఎండిపోతున్నాయి. పత్తిలో సాధారణంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అలాంటిది నాలుగైదు క్వింటాళ్లు రావడమే కష్టమని రైతులంటున్నారు. పెట్టుబడులకు అప్పులు చేసి ఖర్చు చేశామని దిగుబడులు రాకపోతే ఏం చేయాలో తోచడం లేదని తలలు పట్టుకుంటున్నారు.


ఎండిపోయిన పత్తి చెట్టు

అధిక వర్షాలు దెబ్బకొట్టాయి
జంబి శ్రీనివాస్, నెన్నెల



చేలు చక్కగా ఎదిగే సమయంలోనే అధిక వర్షాలతో రోగాలు ముసురుకున్నాయి. పత్తి చేన్లన్నీ ఎర్రబడి ఎండి పోతున్నాయి. రోజుల వ్యవధిలోనే మాయదారి రోగం చేలన్నింటికి పాకింది. పత్తి చెట్లు ఆకురాల్చి మోడులై కనిపిస్తున్నాయి. రెండోసారి వచ్చే పూత, కాతను దక్కించుకుందామంటే చీడపీడలు ముసురుకున్నాయి. ఇప్పటికే ఎరువులు వేశాం. మందులు కొట్టాం. ప్రతీసారి కంటే ఈ ఏడు ఎక్కువ పెట్టుబడి అయింది. దిగుబడులు చేతికివచ్చే వేల వర్షాలు దెబ్బకొట్టాయి.

పెట్టుబడి రావడం కష్టమే
బిరుదు అంజన్న, నెన్నెల



సొంత చేను పది ఎకరాలతో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. అధిక వర్షాల వల్ల రోగాలు ఎక్కువయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో మొదట పగిలిన పత్తి నల్లబడింది. పచ్చికాయలు మురిగి పోతున్నాయి. చెట్టుకు 30 నుంచి 40 కాయల వరకు పాడయ్యాయి. తెల్ల దోమ, పచ్చదోమ సోకింది. పూత, కాతంతా రాలిపోతోంది. చీడపీడల అదుపు కోసం మందులు పిచికారి చేద్దామన్నా వాన సందివ్వడం లేదు. ఈ సీజన్‌లో పెట్టబడులు రావడమే కష్టంగా ఉంది.

భూ భారతి అర్జీలను త్వరగా పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ చంద్రయ్య

తాండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. బుధవారం తాండూర్‌లోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలు ఎన్ని, ఎన్నింటిని పరిష్కరించారు, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయని తహసీల్దార్ జ్యోష్ణను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి హైకోర్టు అనుమతి ఇచ్చినందున ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలుపై సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోత్స్న, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఆపరేటర్ మహేష్ ఉన్నారు.

స్పందించారు...చర్యలు చేపట్టారు

హాజీపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 9వ వార్డులో వరద, బురదనీరు ఇండ్లలోకి చేరిన క్రమంలో మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో"నిలిచిన వరద నీరు..పట్టించుకునేవారు లేరు" అనే వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం ఉదయం పారిశుధ్య సిబ్బందిని పంపించి బురదనీటిని తొలగించే పనులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో 9వ వార్డులో బురదనీరు లేకుండా చేస్తామ ని అధికారులు తెలిపారు.


మురుగునీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సీజేఐ గవాయ్‌పై దాడి హేయం

కాసిపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై జరిగిన దాడి హేయమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయమూర్తిపై బూటు విసిరి న్యాయ వ్యవస్థను అవమానపర్చిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను పూర్తిగా విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను అందరు ఖండించాలన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

దండేపల్లి అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన గంగాధరి రాజలింగు కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బుధవారం శ్రీరాజరాజేశ్వర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మృతుడు రాజలింగు కుటుంబం ఇంటికి వెళ్లి సంఘం నాయకులు నగదును అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల బరిలో సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ బరిలో ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

తాండూర్ మండల స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో సీపీఐ పోటీ చేస్తుందన్నారు. అచ్చలాపూర్ నుంచి 1995లో 2021లో రెండుసార్లు ఎంపీటీసీగా గెలుపొందడం జరిగిందన్నారు. ద్వారకాపూర్‌నుంచి 1988 లో సర్పంచుగా, 2001 ఎంపీటీసీగా గెలవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కొండు బానేష్, సాలిగామ సంతోష్, బొంతల లక్ష్మీనారాయణ, ప్రహ్లాద్, సత్యనారాయణ, శంకర్, దుర్గయ్య, సాయికుమార్, తిరుపతి, శ్రీనివాస్, మొండయ్య, సన్యాసిదేవయ్య, భీమేష్, సురేష్, రాజేష్, రవి, నసీర్, భీమన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లతో ఉజ్వల భవిష్యత్తు
- కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఆయన సందర్శించి పరికరాలను పరిశీలించారు. బోధన తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ టెక్నాలజీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సెంటర్‌లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వృత్తి విద్య, సాంకేతిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఈ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఇందులో కోర్సులు ఉంటాయని, విద్యార్థులకు బోధన కోసం ఏర్పాటు చేసిన పరికరాలు చాలా బాగున్నాయని తెలిపారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని కోర్సులు పూర్తి చేసి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్, అధ్యాపకులు ఉన్నారు.


ఏటీసీలో పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఎంపీడీవో కార్యాలయం పరిశీలన

మందమర్రిరూరల్: మందమర్రి ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం పరిశీలించారు. రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మండల ప్రజాపరిషత్ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించడం జరుగు తుందన్నారు. నామినేషన్‌ల స్వీకరణను వీడియోగ్రఫీ చేయిం చాలన్నారు. నామినేషన్‌ల స్వీకరణలో నిబంధనలు పాటించాలన్నారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

నెన్నెల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే సులభంగా నివారించవచ్చని క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ శశికాంత్ అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు సత్వరం నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. మండలంలోని మన్నెగూడంలో బుధవారం నిర్వహించిన టీబీ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయగా అనుమానించాలన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని చెప్పారు. క్షయ వ్యాధి నిర్ధారణ అనంతరం నయం అయ్యేవరకు ఉచితంగా మందులతో పాటు ప్రతి నెల వెయ్యి రూపాయల పోషణ భత్యాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. తుంపర్ల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించేవారు, పొగాకు ఉత్పత్తులు వాడే వారికి, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి టీబీ తొందరగా సోకుతుందన్నారు. 32 మందికి తెమడ పరీక్ష, 54 మందికి ఎక్స్‌రే తీసేందుకు 102 వాహనంలో బెల్లంపల్లికి తరలించారు. కార్యదర్శి రెహాన, సూపర్‌వైజర్ సుశీల, హెచ్‌ఏ రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రావణి, సంధ్య, పూజిత తదితరులు పాల్గొన్నారు.


మన్నెగూడంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

న్యూట్రిషన్ కిట్ల అందజేత

దండేపల్లి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్రోస్ ఎన్‌జీవో అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను మండల వైద్యాధికారి డాక్టర్ ఎం సతీష్‌కుమార్ పంపిణీ చేశారు, బుధవారం దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టీబీ ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌నాయక్ ఆదేశాల 15 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టిహాకారం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబాటను రైతులు సద్వినియోగం చేసుకోండి
లక్షెట్టిపేట విద్యుత్ శాఖ ఏఈ గణేష్

దండేపల్లి (లక్షెట్టిపేట)అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునేందుకు పొలంబాట కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని లక్షెట్టిపేట విద్యుత్ శాఖ ఏఈ గణేష్ అన్నారు. లక్షెట్టిపేట మండలం కొత్త కొమ్ముగూడెంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఈ మాట్లాడుతూ రైతులు పొలాల్లోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని దాని ద్వారా నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఎమైనా సమస్య ఉంటే రైతులు విద్యుత్ సిబ్బందికి తెలియజేస్తే సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తారన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమన్నారు. గ్రామంలోని వంగిన పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద ఎర్తింగ్, లూస్‌లైన్స్‌పై రైతులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ చంద్రమౌళి, జూనియర్ లైన్‌మెన్ మల్లేష్, స్థానిక విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని రచ్చపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ మోటార్లకు వ్యవసాయ బోరుబావుల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలుంటే విద్యుత్ సిబ్బందికి తెలిజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట కొత్త కొమ్ముగూడెంలో పొలంబాటలో విద్యుత్ శాఖ అధికారులు

గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం
- వాహనదారులకు తప్పని తిప్పలు


దండేపల్లి ఆంధ్రాకాలనీ వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

దండేపల్లి అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రం ఆంధ్రాకాలని సమీపంలో, మేదరిపేట సమీపంలో లక్షెట్టిపేట -ఆదిలాబాద్-నిర్మల్ వెళ్లే రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడంలో నిర్లక్ష్యం చేయడంతో అప్పుడప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రతీ నిత్యం వాహనదారులకు, ప్రయాణీలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైన రాష్ట్రీయ రహదారిపై ఏర్పాడిన పెద్దపెద్ద గుంతలను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే పీడీయాక్టు నమోదు
- శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ - గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న నిందితుల అరెస్ట్

జైపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే పీడీయాక్టు నమోదు చేస్తామని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. బుధవారం జైపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దాసరి నరేష్ అలియాస్ వాసు మారెం అజయ్, బోగె ప్రశాంత్ అనే వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై కొన్ని నెలల నుంచి గ్రామస్థులు తమను చూసి భయపడాలి అనే ఉద్దేశంతో గ్రామంలో కట్టెలు పట్టుకుని తిరుగుతూ గ్రామస్థులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గత నెలలో జక్కం అంజన్నకు చెందిన ఆటో రిక్షాను అతని ఇంటి ముందు నుంచి దొంగతనం చేసుకుని తీసుకువెళ్తుండగా అదుపు తప్పి కింద పడింది. దీంతో ఆటోను నెట్టుకుంటూ వచ్చి అంజన్న ఇంటి ఎదుట పెట్టి వెళ్లి పోయారు. ఈ విషయాన్ని అంజన్న ఈ ముగ్గురు వ్యక్తులను అడగగా అంజన్నను తిట్టి బెదిరించారని తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో రాత్రి అంజన్న ఇంటి వద్దకు వెళ్లి అతని ఇంటికి బిగించిన మూడు సీసీ కెమెరాల్లో రెండు సీసీ కెమెరాలను పగులగొట్టడంతో పాటు అంజన్న ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి అక్రమంగా చొరబడి అంజన్నపై దాడి చేసి పారిపోయారని పేర్కొన్నారు. అంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి ఈ నెల 7న నేరస్తులైన దాసరి నరేష్ అలియాస్ వాసు, బోగె ప్రశాంత్‌లను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు చెన్నూరు కోర్టుకు తరలించినట్లు తెలిపారు. మరో నేరస్తుడు మారెం అజయ్ పరారీలో ఉన్నాడని అతన్ని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ హబీబ్, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య, పోలీసులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం జిల్లా వార్తలు

8

గురువారం 9 అక్టోబరు 2025

అంబులెన్స్‌ల తనిఖీ

వాంకిడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మేనేజర్ మెరుగు నరేష్‌యాదవ్ 108, 102 అంబులెన్స్‌లను బుధవారం తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని మెడికల్ ఎక్విప్‌మెం ట్స్ పని తీరును, మందులను పరిశీలించారు. మూడు నెలల రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 108కి ఫోన్ రాగానే అక్కడికి చేరుకోవాలని సూచించారు. బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించాలన్నారు. కాల పరిమితి అయిన మెడిసిన్‌ను నెల ముందే తీసి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంటీ ప్రవీణ్, పైలెట్ భీంరావు, పైరేట్స్ సీతారాం, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెంచికలపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీర ప్రాంతంలో పులి దాని పిల్లలతో కలిసి సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్ అన్నారు. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో పులి కదలికలు కలకలం రేపుతున్నాయి. దీనిపై స్పందించిన అటవీ శాఖాధికారులు అటవీ ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ విషయమై ఎఫ్ఎస్‌వో జగన్మోహన్‌గౌడ్‌ను సంప్రదించగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీర ప్రాంతంలో పులి దాని పిల్లలతో కలిసి సంచరిస్తుందని తెలిపారు. పెంచకలపేట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల కాపారులు అటవీ ప్రాంతంలోకి పశువులను మేతక కోసం తీసుకు వెళ్లవద్దని అన్నారు. పులి ఎదురుపడితే హాని తలపెట్టకుండా అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఎన్నికల ఖర్చుపై నిఘా

- జడ్పీటీసీకి రూ.4 లక్షలు
- ఎంపీటీసీకి రూ.1.50 లక్షలు
- అభ్యర్థులు వెచ్చించే వ్యయంపై పరిమితులు
- మండల స్థాయిలో సహాయక పరిశీలకులు



ఆసిఫాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై నిఘా ఉంటుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు ఈ ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల ఖర్చుకు వీలు లేదని ఇందుకు పరిమితులు ఉంటాయని చెబుతున్నారు. జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.4 లక్షలకు మించరాదు. ఎంపీటీసీ అభ్యర్థి వ్యయం రూ.1.50 లక్షల లోపు ఉండాలి. ఇక సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎన్నికల ఖర్చుకు కూడా ఓ లెక్క ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. ఐదు వేల జనాభా లోపు ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి అభ్యర్థి ఖర్చు రూ.1.50 లక్షల లోపు అలాగే వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు రూ.30 వేల లోపు ఉండాలి. మరో వైపు ఐదు వేలకు మించి జనాభా ఉన్న గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానానికి బరిలోకి దిగుతున్న అభ్యర్థులకు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుడికి ఖర్చు రూ.50 వేలు ఉంటుందని ఎన్నికల ప్రవర్తన నియమావళి చెబు తోంది. ఖర్చు చేసే ప్రతీ రూపాయి బ్యాంకు లావాదేవీల ద్వారానే జరగాల్సి ఉంటుంది. ఆయా స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసి రోజుకంటే ఒక రోజు ముందుగా ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరవాలి. అభ్యర్థులు ఎప్పటికప్పుడు తమ ఎన్నికల ఖర్చు నియమావళి వివరాలను తెలపాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కేటగిరి	సర్పంచ్	వార్డు	ఎంపీటీసీ
ఎస్టీ	198	1,292	39
ఎస్సీ	32	226	18
బీసీ	67	534	41
జనరల్	38	822	29
మొత్తం	335	2,874	127

పరిశీలకుల నియామకం..

స్థానిక సంస్థలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టేందుకు మండల స్థాయిలో సహాయక పరిశీలకులను(అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు) నియమించారు. గెజిటెడ్ అధికారుల నుంచి ఆఫీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఈ పరిశీలకులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఓ స్థాయిలో ఖర్చు చేస్తుంటారు. ప్రధానంగా పట్టణీకరణ ఎక్కువగా ఉన్న గ్రామ పంచాయతీలు, మండలాల్లో అభ్యర్థుల ఖర్చు భారీగానే ఉంటుంది. ఇంటింటి ప్రచారం. ర్యాలీలు, పోస్టర్లు, కరపత్రాలు, కండువాలు, క్యాప్‌లు, టీషర్టులు వంటి ఖర్చులు ఉంటాయి. జడ్పీటీసీ అభ్యర్థులు సమావేశాలు సైతం నిర్వహిస్తుంటారు. ఎన్నికల ప్రచారానికి వాహనా లను వినియోగిస్తుంటా రు. ఇలా అభ్యర్థులు తాము పెట్టే ఎన్నికల ఖర్చుకు లెక్కలు చూపాలని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల విషయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పాటించాలని ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ నోడల్ అధికారి సూచించారు.

జిల్లాలో 335 పంచాయతీలు..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. 15 మండలాల పరిధిలో 127 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అధికారులు జనాభా ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు, 20 మంది ఇతరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని అన్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలలో భాగంగా గురువారం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కోసం బందోబస్తు అధికారులు, సిబ్బంది నియామకం ఇతర ఎన్నికల అంశాలకు సంబంధించి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రతి జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించనున్నామని చెప్పారు. నామినేషన్ల స్వీకరణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ సజావుగా చేపట్టాలని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండి నామినేషన్ ప్రక్రియ సమీక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో ఎనిమిది జడ్పీటీసీ, 71 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో భాగంగా నామినేషన్ల స్వీకరణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధం ఉన్నామని తెలిపారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ అందించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం సజావుగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌లో సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై డివిజన్ స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి గ్రామ సభలతో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే ధ్యేయం

ఆసిఫాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మహా జనసేన పార్టీ బలోపేతమే ధ్యేయంగా పని చేస్తామని పార్టీ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ రేగుంట మహేష్ అన్నారు.. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహా జనసేన రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపత్‌లు పాల్గొని జిల్లా కన్వీనర్‌గా మహేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. అందరిని కలుపుకుని వెళతూ పార్టీని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

సిర్పూర్(టి), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన యువకులు బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): రొంపల్లి, మెస్రంగూడ గ్రామాల్లో బుధవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మెస్రం యాదవరావు పటేల్, అర్జున్‌లొద్ది రోడ్ల మైసమ్మ పటేల్, మార్కగూడ కుర్సింగె శ్రీనివాస్ పటేల్, రాంజీగూడ తోడసం జగ్గారావులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అనిల్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సాగర్, హరీష్‌కుమార్, అమర్, సాయికిరణ్, వెంకటేశంగౌడ్, శంకర్, దేవ్, పవన్, జగ్గు, దేవ్, వర్ధనేష్, సంతోష్, సాక్రు, జలపతిరావు, రవి, దశంతరావు, రాజేశ్వర్, భీంరావ్, రాము, లచ్చు, నాగు, గణేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న కృషి విజ్ఞాన శాస్త్రవేత్త స్రవంతి

వాంకిడి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాల వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధించవ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం వాంకిడి మండలంలోని నాణ్యమైన కంది విత్తనంతో సాగు చేసిన రైతు బడే నాందేవ్ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని, కంది, పెసరి పంట ఎంతో ఆశాజనకంగా ఉందని తెలిపారు. విత్తనోత్పత్తికి తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పంటల సాగు, వాతావరణ మార్పులు, పంటల స్వభావం, చీడ పీడల నివారణ వాటిపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. రెండు మూడు సంవత్సరాల్లో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణ, ఉద్యాన శాస్త్రవేత్త, ఏఈవోలు రాజేశ్వర్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



సిర్పూర్(టి)లో అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు శంకర్



బెజ్జూరులో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మధుకర్

బెజ్జూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు విధులు పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారి మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపై బుధవారం ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మధుకర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పకడ్బందీగా విధులను నిర్వహించాలని సూచించారు. విధుల్లో పాల్గొనే అధికారులు బ్యాలెట్ పేపర్, చాలెంజ్ ఓటు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికా రులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో గౌరి శంకర్, ఎంఈవో సునీత తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రమేశ్ మాట్లాడుతూ రాబయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పకడ్బందీగా విధులను నిర్వహించాలని సూచించారు. విధుల్లో పాల్గొనే అధికారులు బ్యాలెట్ పేపర్, చాలెంజ్ ఓటు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిర్లక్ష్యంగా ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపై రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కల్పించారు. విధుల్లో పాల్గొనే అధికారులకు బ్యాలెట్ పేపర్, చాలెంజ్ ఓటు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్ రావు, శిక్షకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలపై రైతు వేదికలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పకడ్బందీగా విధులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో జయరాజు, పీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక పోటీలు

రెబ్బెన, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా సబ్ జూనియర్, జూనియర్స్ విభాగం పోటీల్లో పాల్గొనే జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా కన్వీనర్ మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ భాస్కర్, ఏరియా స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, అన్వేష్, కెప్టెన్ కిరణ్‌కుమార్, నరేష్, పీడీ తిరుపతి, రాకేష్, గోపాల్, శ్రీకాంత్, చందు, పి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్టు

గర్భిణులకు పోషకాహారం అందించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా

పెంచికలపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా అన్నారు. మండలంలోని ఎల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణమాసం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహా రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పాలు, కోడిగుడ్లు, బియ్యం, పప్పు, ఆకుకూరలలో భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కిశోర బాలికలు పల్లిపట్టీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు కిశోర బాలికల్లో రక్తహీనత తలెత్తకుండా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భూలక్ష్మి, సరోజ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న పీఎఫ్ బకాయిలు

- రెండేళ్లుగా చెల్లించని అధికారులు
- మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై పట్టింపు కరువు



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

కాగజ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పని చేసే కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్ డబ్బులు రెండేళ్లుగా చెల్లించడంలేదు. వీటితో పాటు ఈఎస్ఐ కార్పొరేషన్‌కు కూడా డబ్బులు చెల్లించలేదు. ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు బకాయిలు కోటి రూపాయిల మేర ఉండడంతో కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు విధుల బహిష్కరించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఇతర అధికారులు చొరవ తీసుకొని చర్యలు జరిపారు. జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బుల చెల్లింపు సమస్య పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు ఆందోళన విరమించి విధుల్లో చేరారు. ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిల చెల్లింపులు ఇంకా పూర్తి స్థాయిలో కాలేదు. కాంట్రాక్టు కార్మికులకు నెల నెలా జీతాల్లో ఈఎస్ఐ, పీఎఫ్ కోత విధిస్తున్నప్పటికీ ఈ డబ్బులను నేరుగా ఈఎస్ఐ కార్పొరేషన్‌కు, పీఎఫ్ కార్యాలయా నికి డబ్బులు చెల్లించడం లేదు. దీంతో బకాయిలు పేరుక పోతున్నాయని కాంట్రాక్టు కార్మికులు వాపోతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులకు వినతి పత్రాలిచ్చినా ముందుకు సాగడం లేదని వాపోతున్నారు. కాగా మున్సిపాల్టీలో పని చేస్తున్న 141 మంది కాంట్రాక్టు కార్మికులు జీత భత్యాలకే ఆస్తిపన్ను వసూలు చేసిన డబ్బులు సరి పోతున్నాయని, ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లించడం కష్టంగా ఉందని అధికారులు చెబుతున్నారని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించేట్టు చూడాలని అంతా కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బుల చెల్లింపు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. నిధులు రాగానే పూర్తి స్థాయిలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇబ్బందులు పడుతున్నాం..



జీతాల్లో కోత విధించినప్పటికీ బకాయిలు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మాకు నెల నెలా జీతాలు సైతం సక్రమంగా రావడం లేదు. జీతాల్లో కోత విధించి పీఎఫ్ డబ్బులు భవిష్యత్తులో ఉపయోగపడుతాని నమ్మకంతో పెట్టుకుంటే ఆ డబ్బులు కూడా కట్టడం లేదు. అధికారులు స్పందించి ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు నెలనెలా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. కార్మికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

- శంకర్, కార్మిక సంఘం నాయకుడు